జై భవానీ.. జైజై భవానీ









ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శనివారం అమ్మ వారు శ్రీలలితాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జై భవానీ.. జైజై భవానీ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. సాయంత్రం నిర్వహించిన ఆది దంపతుల నగరోత్సవం, కళాకారుల నృత్యాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా టీచర్ల విభాగం అధ్యక్షుడిగా యరడ్ల



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన యరడ్ల ఆంజనేయరెడ్డిని పార్టీ ఎన్టీఆర్ జిల్లా టీచర్ల విభాగ అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

స్వచ్ఛ షెహెర్ జోడి నగరాలతో వీఎంసీ ఎంవోయూ




పటమట(విజయవాడతూర్పు): నగరాల్లో శుభ్రతపై చిన్న పట్టణాలు కూడా దృష్టి సారించేలా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని పలు నగరాలకు మెంటర్‌షిప్‌ను అందిస్తున్నామని వీఎంసీ అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. శనివారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో స్వచ్ఛ షెహెర్ జోడి నగరాలతో మెమొరండమ్ ఆఫ్ అండర్‌స్టాండింగ్(ఎంవోయూ) జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ ప్రవేశపెట్టిన స్వచ్ఛ షెహెర్ జోడి–2025లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షన్–2024లో ఉత్తమ స్థానాల్లో ఉన్న నగరాలను మెంటర్ సిటీగా ఉండాలని ఆదేశించిందన్నారు. మెంటర్‌సిటీగా కేంద్ర ప్రభుత్వం వీఎంసీని గుర్తించిందని తెలిపారు. దీనికి అనుబంధంగా నర్సాపూర్, సామర్లకోట, ఆకివీడు, చింతలపూడి, గొల్లప్రోలు 5 నగరాలను మెంటీ సిటీలుగా గుర్తించి, స్వచ్ఛతలో మెరుగైన మార్పులు వచ్చేలా వీఎంసీ కృషి చేస్తుందని చెప్పారు. ఈ మేరకు ఆయా సిటీలతో ఎంవోయూ చేశామన్నారు. ఆయా నగరాల ప్రస్తుత స్థితిగతులు తెలుసుకొని, స్వచ్ఛతలో మెరుగైన నగరాలుగా ఉండేందుకు కావాల్సిన మార్గదర్శకాలు అన్ని చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఎంసీ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జున రావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, నర్సాపూర్ కమిషనర్ ఎం.అంజయ్య, సామర్లకోట కమిషనర్ ఎ.శ్రీవిద్య, ఆకివీడు కమిషనర్ జి. కృష్ణమోహన్, చింతలపూడి కమిషనర్ ఎ.రాంబాబు, గొల్లప్రోలు అసిస్టె అసిస్టెంట్ ఇంజినీర్ మహమ్మద్ ఆలీషా పాల్గొన్నారు.

జన సురక్ష పథకంతో సామాన్య ప్రజలకు భద్రత



భవానీపురం(విజయవాడపశ్చిమ): జన సురక్ష పథకం ద్వారా సామాన్య ప్రజలకు భద్రత లభిస్తుందని భారతీయ స్టేట్ బ్యాంక్(ఎస్‌బీఐ) వెస్ట్ రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. ఎస్‌బీఐ వెస్ట్ రీజియన్ ఆధ్వర్యంలో గొల్లపూడి పద్మావతి కల్యాణ మండపంలో వివిధ పథకాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. సైబర్ నేరగాళ్లు వివిధ రూపాలలో చేస్తున్న మోసాల పట్ల ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా పీఎంజేజేబీవై పథకం ద్వారా లబ్ధిదారు కుటుంబానికి రూ.2 లక్షల చెక్‌ను అందజేశారు. ఫీల్డ్ ఆఫీసర్ ఎఫ్ఐ మేనేజర్ సంతోషం నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. పలు శాఖల మేనేజర్లు గూడవల్లి హిమబిందు, ప్రసాద్, వంశీ, మృత్యుంజయ్ పాల్గొన్నారు.

జీర్ణోద్ధరణకు గురైన ఆలయాలపై దృష్టి



పెదమద్దాలి(పామర్రు): జీర్ణోద్ధరణకు గురైన ఆలయాలపై దృష్టి సారించి, వాటి అభివృద్ధికి కృషి చేస్తామని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ చౌదరి(సుజనా చౌదరి) పేర్కొన్నారు. మండలంలోని పెదమద్దాలి గ్రామంలోని శ్రీ ఉద్దండ వేణుగోపాలస్వామి, మల్లేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్తులు ఉద్దండ వేణుగోపాల స్వామి ఆలయం శిథిలావస్థకు చేరిందని, ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే సందించి మాట్లాడారు. దేవస్థానం పునర్నిర్మాణంపై దేవదాయ శాఖ అధికారులు, దేవదాయ శాఖ మంత్రితో చర్చించి నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. దేవాలయ పునః నిర్మాణానికి తన వంతు సహకరిస్తానని తెలిపారు. అనంతరం ఆలయాల్లో చౌదరికి ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు ప్రసాదాలను అందజేశారు.



లలితా త్రిపురసుందరీదేవిగా మహాలక్ష్మి అమ్మవారు



లలితా త్రిపుర సుందరీ దేవిగా గంగానమ్మ




విజయదుర్గా ఆలయంలో..



లలితాత్రిపురసుందరీదేవిగా చదునుమహాలక్ష్మమ్మ



ధాన్యలక్ష్మీదేవిగా పద్మావతీదేవి



లలితాత్రిపురసుందరీదేవిగా భ్రమరాంబ మాత



వరలక్ష్మీదేవిగా దర్శనమిస్తున్న అష్టలక్ష్ములు

లలితా త్రిపురసుందరీ నమోస్తుతే..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా పలు ఆలయాల్లో అమ్మవార్లకు శనివారం విశేష పూజలు నిర్వహించారు. చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని శ్రీలలితా త్రిపురసుందరీదేవి అలంకరించారు. అమ్మవారిని రాష్ట్ర హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ స్పెషల్ సెక్రటరీ సిసోడియా, సెక్రటేరియట్‌కు చెందిన రామసుబ్బయ్య, ఎం.సుధాకర్, రాజమండ్రి జేసీ చిన్నరాయుడులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద ఆశీర్వచనం, దేవస్థానం తరుపున జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు బెవర సూర్యనారాయణరావు, కొరగంజి భాస్కరరావు, పోతిన సాంబశివరావు, పోతిన బేసు, పోతిన వెంకట ధర్మారావు, తమ్మిన సూర్యకుమారి పాల్గొన్నారు. శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో అమ్మవారికి శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. గంగానమ్మ వారి దేవస్థానంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. శ్రీ దుర్గా గాయత్రి అర్చక యాగ్నిక సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ ఫౌండర్ బసవ కాశీ విశ్వనాథ్, వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలోని శ్రీ పద్మావతిదేవి అమ్మవారు శనివారం శ్రీ ధాన్యలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధికారులు, అర్చకుడు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షించారు. వన్‌టౌన్ శేషయ్య వీధిలోని శ్రీ కృష్ణ ప్రార్థనా సంఘం ప్రాంగణంలో ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సందరీదేవిగా దర్శనమిచ్చారు. ఉత్సవాలను కమిటీ అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ, కార్యదర్శి గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు. బ్రాహ్మణవీధిలో వేంచేసి ఉన్న శ్రీ చదును మహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారు లలితాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో కొలువై ఉన్న అష్టలక్షులు వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కేటీ రోడ్డులో కొలువై ఉన్న శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీ లలితాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తపేట సైకం వారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీ దర్పేశ్వర స్వామి వారి దేవస్థానంలో పార్వతీ అమ్మవారు శ్రీ లలితత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు మురళీ కార్యక్రమాలను పర్యవేక్షించారు. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం)లో కొలువై ఉన్న భ్రమరాంబ అమ్మవారు శ్రీ లలితాత్రిపురసుందరీదేవిగా కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో ఉన్న దాసాంజనేయస్వామి వారి దేవస్థానంలో అమ్మవారు శ్రీ లలితాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు.



భవానీపురం కోళ్ల ఫారం రోడ్‌లో..



ఊర్మిళానగర్ పోలేరమ్మ దేవస్థానంలో..



సెక్రటేరియట్ అధికారులకు జ్ఞాపికలను అందజేస్తున్న కొత్త అమ్మవారి దేవస్థాన కమిటీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం కోళ్లఫారం రోడ్‌లో అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీ దేవీగా దర్శనమిచ్చారు. చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోని కుండల మార్కెట్‌లోగల శ్రీ గంగా – దుర్గా – మారెమ్మ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారిని శ్రీలలితా త్రిపుర సుందరీ దేవీగా అలంకరించి దేవీ ఉపాసకురాలు తమ్మిన రవీన ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవానీపురం ఊర్మిళా సుబ్బారావు నగర్ గ్రామదేవత పోలేరమ్మ దేవస్థానంలో పోలేరమ్మ శ్రీలలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. సూరసాని రామిరెడ్డి, జీ విజయబాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కనకదుర్గమ్మకు నృత్యనీరాజనం



విజయవాడకల్చరల్: దసరా మహోత్సవాల సందర్భంగా కనకదుర్గానగర్‌లోని కళావేదికపై శనివారం ప్రదర్శిస్తున్న నృత్య కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. శనివారం నాటి కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచే కాక తమిళనాడు, కర్నాటక నుంచి వచ్చిన కళాకారులు కనకదుర్గమ్మకు నృత్య నీరాజనాలు సమర్పించారు. ఎస్.సామ్రాజ్యం తాళం భజనతో ఆకట్టుకున్నారు, భక్తి రంజని కార్యక్రమంలో పి.సాయి సాత్విక, వి.సీతామహాలక్ష్మి, వి.లతానాగమణి, నాగేశ్వరమ్మ, ఆర్ సత్యనారాయణ భక్తి గీతాలను ఆలపించారు. కూచిపూడి నృత్యకార్యక్రమంలో భాగంగా సుదీక్ష, పార్వతి, వి.భారతి, ఎస్ సౌందర్య, పూజశ్రీ, జి.వి జయగౌరి, సురేష్ గోపి, హైదరాబాద్‌కు చెందిన వైభవి, ప్రభాకర్, రేణుక బృందాలు, కర్నాటకకు చెందిన విద్యాధరి, ఎం.లలితాదేవి, తిరుపతికి చెందిన లక్ష్మీపతి, ఎల్.తేజస్విని, అన్నమయ్య, రామదాసు కీర్తలను ఆలపించారు.

ఆకట్టుకున్న జిశ్రిత నృత్యం

బాల నృత్య కళాకారిణి జిశ్రిత(5) జయజయనటరాజ, మూషిక వాహన, అదిగో భద్రాద్రి కీర్తనలకు నృత్యాలను అభినయించింది. కార్యక్రమ నిర్వాహకులు కళాకారులకు జ్ఞాపికలను ప్రశంసా పత్రాలను అందజేశారు. చిన్నారులకు అమ్మవారి దర్శనానికి అనుమతించారు. వారికి వాహన సౌకర్యం కల్పించాలని ఈవో ఆదేశించినప్పటికి దిగువ స్థాయి సిబ్బంది పట్టించుకోక పోవడంతో వారికి తిప్పలు తప్పలేదు.

పోలీసుల ఓవరాక్షన్



నిరసన తెలుపుతున్న ఏఈవోలు, ఈఈలు ఇతర అధికారులు

- కొండదిగువున ఆలయ ఏఈవోలు, ఈఈలను సైతం అడ్డగించిన పరిస్థితి
- ఆందోళనకు దిగిన ఆలయ ఉన్నతాధికారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలలో ప్రతి ఏటా మాదిరిగానే పోలీసులు ఈ ఏడాది సైతం తమ ఓవరాక్షన్‌తో భక్తులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కలెక్టర్, పోలీస్ కమిషనర్ పదేపదే పర్యటిస్తున్నా పోలీసు ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్న తీరు అందరికీ తలనొప్పులు తెస్తున్నాయి. దుర్గగుడి అధికారులు, అర్చకులు, సిబ్బంది ఎవరూ ఆలయం పరిసరాల్లోకి రాకూడదంటూ పోలీసు అధికారులు వారిని శనివారం వెనుకకు తిప్పి పంపారు. మహామండపం లిఫ్ట్ వద్ద సైతం ఎవరినీ లోపలకు అనుమతించకుండా అడ్డుకున్నారు. దీనిపై ఆ సిబ్బంది పదేపదే ఈవో కార్యాలయానికి ఫోన్ చేసి తమను అడ్డుకున్నారంటూ ఫిర్యాదులు చేశారు. దసరా ఉత్సవాల మొత్తాన్ని ఈవో తరువాత వాటిని పర్యవేక్షించేది, ఏర్పాట్లును చూసేది, నిరంతరం వాటిని పరిశీలించేది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు (ఏఈవోలు), ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఈఈ)లు. వారందరూ నిరంతరం అటుఇటు తిరుగుతూ విధులు నిర్వహిస్తున్న వందలాదిమంది సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తుంటారు. వారిని సైతం పోలీసులు అడ్డుకొని కలెక్టర్, పోలీస్ కమిషనర్ చెప్పారు అందుకే పంపడం కుదరదు, మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండంటూ చెబుతూ ఉత్సవాలకు ఆటంకాలను కలిగించారు. ఆలయ ఈవో సెట్‌లో పదేపదే చెప్పినా మహామండపం వద్ద విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ స్థాయి అధికారి, ఇతర సిబ్బంది చాలా దురుసుగా వ్యవహరించారు. స్థానిక సీఐ గురుప్రకాష్ అక్కడకు చేరుకొని వివరించినా వారిని అనుమతించటమంటూ కూర్చోవటంతో పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. దానికి తోడు స్థానికంగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ, ఇతర సిబ్బంది దారుణమైన భాషను వాడుతూ అర్చకులను సైతం ఇబ్బందులకు గురి చేశారు.

ఆందోళనకు దిగిన ఆలయ ఉన్నతాధికారులు

పోలీసుల తీరుతో ఆలయ ఉన్నతాధికారులు ఆందోళనకు దిగారు. ఆలయ చరిత్రలో ఇప్పటి వరకూ ఏఈవో స్థాయి అధికారులు నిరసన వ్యక్తం చేసిన దాఖలాలు లేవు. సుమారు ముగ్గురు ఏఈవోలు, డౌన్ హిల్ ఈఈ మహామండపం వద్ద అనుమతించకపోవటంతో వారు అక్కడే ఉండి తమ నిరసనను వ్యక్తం చేశారు. పోలీసు అధికారులు వ్యవహరిస్తున్న తీరు, విమర్శలతో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకోవటంతో పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు అక్కడకు చేరుకున్నారు. అధికారులతో చర్చించారు. అయితే పోలీసు కమిషనర్ ఆదేశిస్తేనే తాము పంపటం లేదని ఒక పక్క చెబుతున్న అధికారులు మళ్లీ ఆయనే వచ్చి మాట్లాడటంపై ఆలయ అధికారులు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. శాఖలు, అధికారుల మధ్య సమన్వయం లేకపోతే ఎలా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. దురుసుగా, ఆలయ ప్రాంగణంలో వాడకూడని భాషను వాడుతున్న సిబ్బందిని ఉన్నతాధికారి వెనుకేసుకొస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అమ్మవారిని దర్శించుకున్న సినీనటుడు బాలకృష్ణ



వించిపేట(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జరిగే దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శనివారం శ్రీ లలితాత్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మను హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఆయనకు దర్శనం చేయించి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి కరుణాకటాక్షాలు రాష్ట్ర ప్రజలపై సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలపై తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు చెప్పారు.

వీఐపీ టైం స్లాట్‌లో అధికమైన రద్దీ

– చెకింగ్ పాయింట్ల వద్ద తోపులాట

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వీఐపీ టైం స్లాట్ మార్పులతో సామాన్య భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని వీఐపీల కోసం తెల్లవారు జామున 5 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 7 గంటలకు ప్రత్యేక టైం స్లాట్‌లను ఏర్పాటు చేశారు. అయితే ఉదయం, సాయంత్రం టైం స్లాట్‌లకు ఓ మోస్తరుగా డిమాండ్ ఉండగా, మధ్యాహ్నం 3 గంటల టైం స్లాట్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంది. పోలీసు, రాజకీయ నాయకులతో పాటు నగర ప్రముఖుల సిఫార్సులతో మధ్యాహ్నం టైం స్లాట్‌కు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఓం టర్నింగ్, జోనల్ సెల్‌తో పాటు గాలిగోపురం పాయింట్ల వద్ద రద్దీ అధికంగా ఉంటోంది. వీఐపీ క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి గంటకు పైగా సమయం పడుతుంది. దీని కారణంగా కొండపైకి వృద్ధులు, దివ్యాంగుల వాహనాలను సైతం నిలిపివేస్తున్నారు. శనివారం పలువురు వృద్ధులు, దివ్యాంగులు సాధారణ క్యూలైన్‌లోనే అమ్మవారిని దర్శించుకోగా, మరి కొందరు ఘాట్‌రోడ్డు మీదగా నడుచుకుంటూ వచ్చి వీఐపీ క్యూలైన్‌లోకి చేరుకుంటున్నారు.



ఓం టర్నింగ్ చెకింగ్ పాయింట్ వద్ద భక్తుల తోపులాట

నేడు గుర్రం జాషువా జయంతి

విజయవాడకల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సృజనాత్మక సమితి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం 11 గంటలకు కవి కోకిల గుర్రం జాషువా 130వ జయంతి వేడకలను నిర్వహిస్తున్నట్లు సృజనాత్మక సమితి సీఈవో ఆర్.మల్లిఖార్జునరావు తెలిపారు. మంత్రి దుర్గేష్‌తో పాటు పలువురు పాల్గొంటారని తెలిపారు.

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి : కమిషనర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరం ప్రతినిత్యం పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య సిబ్బంది పనిచేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శనివారం బందర్ రోడ్డు వెటర్నిటీ హాస్పిటల్, బెంజ్ సర్కిల్, నిర్మల కాన్వెంట్ జంక్షన్, రమేష్ హాస్పిటల్ జంక్షన్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం తలెత్తకూడదని, ప్రతినిత్యం రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ల అంచుల్లో చేరుకుంటున్న మట్టి, దుమ్మును కూడా శుభ్రం చేయాలని అన్నారు. రోజూ ఇళ్ల వద్ద వ్యర్థాలను సేకరించాలని, ప్రజలు రోడ్లపై వ్యర్థాలు వేయకుండా వారికి అవగాహన కల్పించాలని కార్పొరేషన్ సిబ్బందికి సూచించారు.



పారిశుధ్య కార్మికురాలితో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర